ప్రయాణం.. ప్రహసనం

- తగరపువలస వద్ద నిర్మించని అండర్‌పాస్ వే
- హైవే విస్తరణ సమయంలో విస్మరించిన ఎన్‌హెచ్ఏఐ
- ప్రత్యామ్నాయ మార్గం లేక ప్రయాణికుల ప్రయాస
- 2 కి.మీ. పైగా అదనపు ప్రయాణం



అవంతి కళాశాల వద్ద ప్రమాదకర స్థితిలో డివైడర్ దాటుతున్న ద్విచక్రవాహనం

తగరపువలస: తగరపువలస వాసులకు జాతీయ రహదారి దాటడం ప్రహసనంగా మారింది. వాహనచోదకులు ప్రమాదకరమైనా డివైడర్‌ను దాటి వెళ్లడం..లేదా 2 కి.మీ చుట్టూ తిరిగి రావడం చేయాల్సి వస్తోంది. జాతీయ రహదారి విస్తరణ సమయంలో అండర్‌పాస్ వే నిర్మించక పోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. ప్రత్యామ్నాయంగా గోస్తని నదిపై పాత వంతెన మార్గాన్ని పునరుద్ధరించినా వాహనదారులకు ప్రయాణ ప్రయాస తగ్గినట్లే.



బంగ్లామెట్ట నుంచి గోస్తనీనది మీదుగా పునరుద్ధరించవలసిన శిథిల వంతెన రహదారి

చుట్టూ తిరిగి రావాల్సిందే..

విశాఖ నుంచి జాతీయరహదారి మీదుగా ప్రయాణించేవారు నేరుగా తగరపువలస చేరుకునే అవకాశం లేకుండా పోయింది. ఆనందపురం మండలం వెల్లంకి లేదా భోగాపురం మండలంలోని మహరాజుపేట నుంచి మాత్రమే తగరపువలసలోకి చేరుకోగలరు. భీమిలి మండలంతో పాటు పద్మనాభం మండలంలోని పలు పంచాయతీలలోకి చేరుకోవాలన్నా తగరపువలస చుట్టూ తిరిగి భోగాపురం మండలంలోకి అడుగుపెట్టిన తరువాతే ఆయా పంచాయతీలలోకి చేరుకోగలరు. దీంతో ఆటోలు, ద్విచక్రవాహనాల యజమానులు కూడా అదనంగా రెండు కిలోమీటర్లు చుట్టూ తిరిగి రావలసి ఉంటుంది. తగరపువలసలోని అంబేడ్కర్ కూడలి నుంచి బంగ్లామెట్ట, వెంకటేశ్వరమెట్ట వద్దకు చేరుకుని ప్రమాదకరమైన మలుపు తీసుకుని బాలాజీనగర్, ఈఎస్ఐ కూడలి వద్ద అండర్ పాస్ ద్వారా అవతలి సర్వీస్ రోడ్డుకు చేరుకుని భోగాపురం మండలంలోని మహరాజుపేట చేరుకుని అక్కడి అండర్‌పాస్ ద్వారా తిరిగి మరో సర్వీస్ రోడ్డు నుంచి వెనక్కు రావాలి. ఇంత కష్టం పడలేని ద్విచక్రవాహనదారులు అవంతి విద్యాసంస్థల ఎదురుగా ప్రమాదకరమైన డివైడర్ దాటి, తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు.

ఇదీ పరిస్థితి..



వెంకటేశ్వరమెట్ట వద్ద ప్రమాదకరమైన మలుపు

1990కు ముందు తగరపువలస కూడలి నుంచి బంగ్లామెట్ట మీదుగా గోస్తనీనదిపై వంతెన ఉండేది. వందేళ్ల నాటి ఆ వంతెన దాటి అవతలి దీవీస్ రోడ్డుకు చేరుకునేవారు. 1990లో గోస్తనీనదికి వచ్చిన వరదల కారణంగా వంతెన నామరూపాల్లేకుండా పోయింది. దీంతో స్థానికులు జాతీయ రహదారిపై నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. కానీ 8 ఏళ్ల క్రితం జాతీయ రహదారుల విస్తరణ సమయంలో తగరపువలస ప్రాధాన్యతను పక్కనపెట్టి అడ్డదిడ్డంగా నిర్మాణాలు చేపట్టడంతో స్థానికులకు దూరాభారమైంది. పైగా ఆర్టీసీ బస్సులకు కూడా దూరమైపోయారు.

ఇలా చేస్తే మేలు..

- చుట్టూ తిరిగే యాతన లేకుండా పాత వంతెన ప్రదేశంలో గోస్తనీనదిపై ఆటోలు, ద్విచక్రవాహనాలు, పాదచారులు రాకపోకలు సాగించేలా చిన్న వంతెన నిర్మించాలని భీమిలి నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.
- జాతీయరహదారికి ఇరువైపులా ఉన్న టి.నగరపాలెం, దీవీస్–అన్నవరం రోడ్లను కలుపుతూ వెల్లంకి, వేములవలస మాదిరిగా అండర్‌పాస్ వే నిర్మించి ప్రమాదాలు అరికట్టాలని వాహనదారులు కోరుతున్నారు. ఇలా చేస్తే స్థానికులు తగరపువలస నుంచి మహరాజుపేట వరకు చుట్టూ తిరిగే అవసరం లేకుండా సమయం ఆదా అవుతుందని అంటున్నారు.



మహరాజుపేట నుంచి తిరిగి సర్వీస్ రోడ్డులో వస్తున్న వాహనాలు

గోస్తనీ నదిపై వంతెన నిర్మించాలి



గతంలో గోస్తనీనదిపై వంతెన ఉండటంతో తగరపువలస నుంచి పద్మనాభం, భీమిలి మండలాల పంచాయతీల రాకపోకలకు వీలుగా ఉండేది. శిథిలమైన తరువాత దానిని పునరుద్ధరించలేదు. దీంతో స్థానికులు చుట్టూ తిరిగిరావాల్సి వస్తోంది. వంతెన నిర్మిస్తే అందరికీ ఎంతో ఉపయోగం.

– సరగడ నాగిరెడ్డి, సంతపేట

గుడివాడ వద్ద వంతెన వృథాయే..



20 ఏళ్ల క్రితం చిట్టివలస నుంచి గుడివాడకు వంతెన నిర్మించినా ద్విచక్రవాహనదారులకు తప్ప ఆటోలు, ట్రాక్టర్లకు పనికిరాకుండా పోయింది. పైగా జాతీయరహదారికి దూరంగా ఉండటంతో అందరికీ అందుబాటులో ఉండటం లేదు.

– డీవీఎస్ ప్రసాద్, ఆదర్శనగర్

ప్రయాణ ప్రయాస తగ్గించాలి



విశాఖ నుంచి వచ్చే బస్సులన్నీ తగరపువలస కూడలి ద్వారా మళ్లించి స్థానిక ప్రయాణికులకు ప్రయాస తగ్గించాలి. అవసరమైతే గోస్తనీనదికి చేరువలో ఇరువైపులా అండర్‌పాస్ రహదారులు నిర్మిస్తే దూరం తగ్గుతుంది.

– జగన్నాథ ఎల్లాజీ, చిట్టివలస



విజయనగరం వైపు వెళ్లాలంటే తగరపువలస వరకు వచ్చి అండర్‌పాస్ ద్వారా వెనక్కు వెళ్లవలసిన మార్గం



టి.నగరపాలెం జాతీయరహదారి ముఖద్వారం వద్ద అండర్‌పాస్ నిర్మించవలసిన ప్రాంతం

క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

తగరపువలస: ఆనందపురం మండలం శొంఠ్యాం సబ్‌స్టేషన్ 11 కేవీ గంగసాని అగ్రహారం ఫీడర్, పరదేశిపాలెం సబ్‌స్టేషన్ కల్లివానిపాలెం ఫీడర్ల పరిధిలో నిర్వహణ పనుల కారణంగా మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ కారణంగా మామిడిలోవ, ఎస్‌జీఆర్ పురం, గంగసాని అగ్రహారం, సత్రం జంక్షన్, గండిగుండం, రామవరం, బోయపాలెం, కల్లివానిపాలెం, గంభీరం, గంభీరం బీసీ కాలనీ, యాతపేట, జేఎన్ఎన్‌యుఆర్ఎం కాలనీ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

వారసత్వ భూములను ఆన్‌లైన్ చేయాలని వినతి

తగరపువలస: పూర్వం నుంచి సాగుహక్కు అనుభవంతో ఉన్న భూములను రెవెన్యూ వెబ్ రికార్డులలో ఆన్‌లైన్ చేయాలని కోరుతూ భీమిలి మండలం తాటితూరు రైతులు తహసీల్దార్ పైల రామారావుకు సోమవారం వినతి పత్రం అందించారు. ప్రస్తుతం పంచాయతీలో రీ సర్వే అవుతున్నందున భూములు ఆన్‌లైన్ అవుతాయని ఆశతో ఎదురు చూస్తున్నామని తెలిపారు. అయితే, వారసత్వ భూములు వెబ్ ల్యాండ్ రికార్డులో ఆన్‌లైన్ చేయడం కుదరదని రీ సర్వే సిబ్బంది తమ ఆశలపై నీళ్లు చల్లారన్నారు. తమకు న్యాయం చేయాలని తహసీల్దార్‌ను కోరారు.

నాగాలాండ్ ఐసీడీఎస్ బృందం సందర్శన



చిన్నారులకు అన్న ప్రాసన చేస్తున్న నాగాలాండ్ ఐసీడీఎస్ బృందం

పద్మనాభం: నాగాలాండ్‌కు చెందిన ఐసీడీఎస్ బృందం పద్మనాభం మండలంలోని ఆరు అంగన్‌వాడీ కేంద్రాలను సోమవారం సందర్శించింది. సుపోషిత్ గ్రామ పంచాయతీలుగా ఎంపికైన రేవిడి అంగన్‌వాడీ, రౌతులపాలెం అంగన్‌వాడీ, కృష్ణాపురం, కృష్ణాపురం కాలనీ అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు మద్దిలో రెండు అంగన్‌వాడీ కేంద్రాలను సీడీపీవో ఆర్.చిరహోసునై యసోయు, సూపర్ వైజర్ లోస్సుంబెని సందర్శించారు. వీరు గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్న ప్రాసన చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా రేషన్ సరిగా అందుతుందో లేదో ఇళ్లకు వెళ్లి అడిగి తెలుసుకున్నారు. వీరి వెంట భీమునిపట్నం ఐసీడీఎస్ సీడీపీవో శ్రీదేవి, సూపర్‌వైజర్లు అనిత, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

కొత్తమ్మతల్లికి ప్రత్యేక అలంకరణ



తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు సంతపేట, కొత్తపేట తదితర గ్రామాలదేవత కొత్తమ్మతల్లిని సోమవారం సాయంత్రం గులాబీలు, జాజులు, బంతి పువ్వులు, గజమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. రాయల్ రెడ్డీస్ యూత్ ఆధ్వర్యంలో చేసిన ఈ విశేష అలంకరణలోనే మంగళవారం భక్తులకు దర్శనాలు కల్పించనున్నారు. సంతపేటకు చెందిన కిల్లాడ భరద్వాజ, గౌరి దంపతులు ఈ అలంకరణకు సహకారం అందించారు.

నేటి నుంచి శరణ్య వేంకటేశ్వర ఆలయ వార్షిక వేడుకలు

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం పైడా విద్యాసంస్థల ఆవరణలోని శ్రీశరణ్య వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవ కార్యక్రమాలు నాలుగు రోజుల పాటు జరుగనున్నాయి. మంగళవారం విష్వక్సేన పూజ, బుధవారం ధ్వజారోహణం, శ్రీవారి కల్యాణం, గురువారం ప్రత్యేక హోమాలు, చివరి రోజైన శుక్రవారం కొట్నాల ఉత్సవం, శ్రీచక్రస్నానం, వసంతోత్సవంతో వేడుకలు ముగియనున్నాయి.

వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం

మధురవాడ: జీవీఎంసీ 5, 7 వార్డుల పరిధి మారికవలస, వాంబేకాలనీల్లో సకల ఎన్జీవో ఆధ్వర్యంలో చిన్నారులకు వేసవి శిక్షణ శిబిరం ఏర్పాటు చేశారు. దీనిని ఎంఈవో రవీంద్రబాబు ప్రారంభించారు. 10నుంచి 18 సంవత్సరాల పిల్లలకు నైపుణ్యాలు మెరుగుపరుస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎ.బి.విజయ్ కుమార్, మహిళా పోలీస్ డి.ప్రియాంక, సకల సంస్థ ప్రతినిధులు సకల, జ్యోతి, ఇందు తదితరులు పాల్గొన్నారు.

జ్యూట్‌మిల్లు కార్మికుల సమస్యలపై ఎమ్మెల్యే స్పందించాలి



సమావేశంలో పాల్గొన్న అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు

తగరపువలస: చిట్టివలస జ్యూట్‌మిల్లు కార్మికుల బకాయిలపై ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు స్పందించాలని అఖిల పక్ష కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. చిట్టివలస కాంగ్రెస్ కార్మిక సంఘ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. కార్మికులకు రావలసిన బకాయిలపై రెండేళ్లుగా మిల్లు యాజమాన్యం స్పందించడం లేదన్నారు. ఎమ్మెల్యే గంటా జోక్యం చేసుకుని యాజమాన్యం, జాయింట్ లేబర్ కమిషనర్, పీఎఫ్ అధికారులను సమన్వయపరచి కార్మికుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలన్నారు. సమావేశంలో నాయకులు దల్లి అప్పలరెడ్డి, మునకాల ఆదినారాయణరెడ్డి, కొండపు ఈశ్వరరావు, చిల్ల అప్పలసూరి, సాడి అచ్చారావు, గొలగాని రాము, తమ్మిన కూర్మారావు, ఎం.దేవుళ్లు, నరవ రామారావు తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితునికి ఏడాది జైలు శిక్ష



ఎర్నింటి కృష్ణబాబు

తగరపువలస: భీమిలి మండలం శింగనబంధ ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో చోరీకి పాల్పడిన నిందితుడు ఎర్నింటి కృష్ణబాబుకు భీమిలి 15వ అదనపు మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ డి.సౌజన్య సోమవారం ఏడాది జైలు శిక్ష విధించారు. 2021 నవంబరు 6న నిందితుడు స్కూల్లోకి చొరబడి రూ.7వేల నగదు, 2 జతల షూస్, లాండ్రీలో బట్టలు దొంగిలించాడు. అప్పట్లో మజ్జివలసకు చెందిన స్కూల్ సూపర్‌వైజర్ ఎల్లబిల్లి అప్పారావు ఫిర్యాదు మేరకు భీమిలి ఏఎస్ఐ ఆర్వీఎస్ఎన్ మూర్తి కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా డెంకాడ మండలం గొండయ్యపాలెం గ్రామానికి చెందిన పాత ముద్దాయి అయిన కృష్ణబాబును అరెస్ట్ చేసి, చోరీ సొత్తు రికవరీ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు విచారణలో భాగంగా నేరం రుజువు కావడంతో శిక్ష విధించారు. దర్యాప్తు అధికారి మూర్తి, కోర్టు హెడ్ కానిస్టేబుల్ ఊడికల వరలక్ష్మి, క్రైమ్ ఎస్ఐ ఎస్.సూర్యప్రకాశరావును ఉన్నతాధికారులు అభినందించారు.

పీఎఫ్ కమిషనర్ దృష్టికి జ్యూట్ కార్మికుల సమస్యలు



పీఎఫ్ కమిషనర్ కృష్ణమూర్తి రాజుతో ఇంటక్ నాయకులు వరహాలరాజు, రాజశేఖర్, నాగభూషణం

తగరపువలస: చిట్టివలస జ్యూట్‌మిల్లులో బకాయి ఉన్న కార్మికులకు యాజమాన్యం పీఎఫ్, పెన్షన్లు చెల్లించేలా చూడాలని కోరుతూ పీఎఫ్ కమిషనర్ కృష్ణమూర్తి రాజును ఇంటక్ కోరింది. ఇంటక్ నాయకులు కాకర్లపూడి వరహాలరాజు, మంత్రి రాజశేఖర్, నాగభూషణం పీఎఫ్ కమిషనర్‌ను కలిసి, వినతిపత్రం అందించారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారని చిట్టివలస జ్యూట్ మిల్లు ఇంటక్ అధ్యక్షుడు వరహాలరాజు తెలిపారు. కార్మికులకు సంబంధించిన వివరాలు రెండు రోజుల్లో తీసుకురావాలని కమిషనర్ సూచించారన్నారు.

కాలువపైనే కట్టడం



కాలువపై చేపట్టిన నిర్మాణం

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్ పరిధి సుభాష్‌నగర్‌లో ఓ వ్యక్తి కాలువను ఆక్రమించి, దానిపై నిర్మాణం చేపడుతున్నాడు. దీనిపై స్థానికులు సచివాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ ప్రాంత ప్రధాన కాల్వను ఆక్రమించి నిర్మాణం చేపడుతున్నారని, దీని కోసం కాల్వ మొత్తం మూసివేశారని తెలిపారు. దీంతో మురుగు నీరు నిల్వ ఉండిపోయి, దుర్వాసనతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. వారం క్రితం టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఈ ఆక్రమణపై ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి కాలువపై నిర్మాణం తొలగించాలని కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో విశాఖవాసి మృతి

మరొకరికి తీవ్ర గాయాలు



లారీ కింద చిక్కుకున్న మెరుగు బాలాజీ

గజపతినగరం: విజయనగరం జిల్లా గజపతినగరం మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల జంక్షన్ (మెంటాడ జంక్షన్) వద్ద లారీ ఢీకొట్టిన ప్రమాదంలో ఒకరు మృతి చెందగా.. మరొకరికి తీవ్ర గాయాలైన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. గజపతినగరం ఎస్సై కె.కిరణ్‌కుమార్ నాయుడు తెలియజేసిన వివరాల ప్రకారం.. విశాఖపట్నం జిల్లా మధురవాడకు చెందిన మెరుగు బాలాజీ (25), అనంతగిరి మండలం రొంపిల్లి పంచాయతీ మూలవలస గ్రామానికి చెందిన కోటపర్తి లక్ష్మణరావు ద్విచక్ర వాహనంపై మధురవాడ నుంచి అనంతగిరి మండలం మూలవలసకు బయలుదేరారు. గజపతినగరం మండల కేంద్రంలోని నాలుగురోడ్ల జంక్షన్ వద్దకు వచ్చేసరికి విశాఖపట్నం నుంచి రాయ్‌పూర్ వెళ్తున్న బొగ్గు లారీ వెనుక నుంచి ఢీ కొట్టింది. దీంతో ద్విచక్ర వాహనం నడుపుతున్న కోటపర్తి లక్ష్మణరావు అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక కూర్చున్న బాలాజీ లారీ చక్రం కింద ఇరుక్కుపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే క్షతగాత్రుడ్ని స్థానికులు గజపతినగరం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ చోటేలాల్ (మధ్యప్రదేశ్)ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మృతుడు, క్షతగాత్రుడు మధురవాడలో ప్లంబింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుండేవారు. క్షతగాత్రుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

హైమాస్ట్ లైట్ల పునరుద్ధరణ



చిట్టివలస ఈఎస్ఐ కూడలి వద్ద వెలుగుతున్న హైమాస్ట్ లైట్లు

తగరపువలస: చిట్టివలస ఈఎస్ఐ ఆస్పత్రి కూడలి వద్ద హైమాస్ట్ లైట్లతో పాటు ఆదర్శనగర్ వరకు వెలగని వీధిదీపాలను జీవీఎంసీ ఇంజినీరింగ్ సిబ్బంది పునరుద్ధరించారు. 'అంధకారంలో హైవే' శీర్షికతో సాక్షిలో సోమవారం ప్రచురించిన వార్తకు సిబ్బంది స్పందించారు. లైట్లను పునరుద్ధరించారు. హైవే, సర్వీస్ రోడ్లపై వెలగని వీధి దీపాల గురించి హైవే అథారిటీ దృష్టికి తీసుకువెళ్లినట్లు సిబ్బంది తెలిపారు.

ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి



మధురవాడలో కొవ్వొత్తులతో నివాళులు అర్పిస్తున్న సీపీఎం శ్రేణులు

మధురవాడ: పహల్గాంలో పర్యాటకులపై దాడికి పాల్పడిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని సీపీఎం నాయకులు కోరారు. ఉగ్రవాదుల కాల్పుల్లో మృతి చెందిన వారికి మధురవాడ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మార్కెట్ నుంచి అప్ బ్రిడ్జి, హైస్కూల్, జీవీఎంసీ ఆఫీసు మీదుగా ఎర్ర జెండాలు, జాతీయ జెండాలతో శాంతి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు డి.అప్పలరాజు, పి.రాజ్‌కుమార్, డి.కొండమ్మ, జి.కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

బోరుబావికి ప్లాట్‌ఫాం నిర్మించాలి



రెడ్డిపల్లిలో ప్లాట్‌ఫాం నిర్మించాల్సిన బోరు

పద్మనాభం: మండలంలోని రెడ్డిపల్లిలో సాయి మరిళీ నిలయం వద్ద బోరు బావికి ప్లాట్‌ఫారం లేదు. దీంతో ఇది నిరుపయోగంగా పడి ఉంది. బోరు బావి వద్ద పిచ్చి మొక్కలు దట్టంగా ఉన్నాయి. ఈ కారణంగా బోరు బావి వద్దకు స్థానికులు నీరు పట్టుకోవడానికి వెళ్లడం లేదు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి బోరు బావి వద్ద ప్లాట్‌ఫారం నిర్మించేందుకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

పీజీఆర్ఎస్‌పై అధికారుల చిన్నచూపు

హాజరు కాని విభాగాధిపతులు



జోన్-2 కార్యాలయంలో పీజీఆర్ఎస్‌కు హాజరైన అధికారులు

మధురవాడ: ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం నిర్వహించే పీజీఆర్ఎస్‌కు అధికారులు డుమ్మా కొడుతున్నారు. మధురవాడ జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలోనూ ఇదే పరిస్థితి ఎదురైంది. జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి సెలవులో ఉండటంతో ఈఈ శాంతి రాజు కార్యక్రమానికి హాజరు కావాల్సి ఉంది. కానీ, ఆయన సకాలంలో హాజరు కాకపోవడంతో సూపరింటెండెంట్ అప్పలరాజు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. టౌన్‌ప్లానింగ్, ఇంజినీరింగ్, రెవెన్యూ తదితర విభాగాధిపతులెవరూ హాజరుకాకపోగా, కిందిస్థాయి అధికారులు మాత్రం సమయం దాటాక ఎప్పటికో వచ్చారు. దీంతో ఎంతో వ్యయప్రయాసలకోర్చి దూరం నుంచి వచ్చిన వృద్ధులకు, ఇతర అర్జీదారులకు ఎదురుచూపులు తప్పలేదు. ఇతర విభాగాల అధికారులు కూడా అంతంత మాత్రంగానే హాజరయ్యారు.

11 అర్జీలు

జోన్–2లో పీజీఆర్ఎస్‌కు ప్రజల నుంచి 11 అర్జీలు వచ్చాయి. ఇందులో టౌన్ ప్లానింగ్–3, ఈఈ వర్క్స్–3, వాటర్ సప్లై–4, రెవెన్యూ విభాగానికి 1 చొప్పున అర్జీలు వచ్చాయి.

జోన్–1కు ఒకే ఒక్క వినతి

భీమునిపట్నం: భీమిలి జోనల్ కార్యాలయం వద్ద జెడ్సీ ప్రేమ ప్రసన్నవాణి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు ఒకే ఒక్క వినతి వచ్చింది. పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి ఒక వినతి వచ్చిందని, దీన్ని పరిశీలించి త్వరలో పరిష్కరిస్తానని జెడ్సీ తెలిపారు.